# ఓటరు జాబితా రెడీ

- ప్రకటించిన జిల్లాల కలెక్టర్లు
- వెల్లడించిన అధికారులు
- నియోజకవర్గాల వారీగా వివరాలు

వరంగల్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఓటర్ల జాబితా తయారైంది. జిల్లా ఎన్నికల అధికారుల హోదాలో కలెక్టర్లు బుధవారం తుది జాబితాను వెల్లడించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్లు, మహిళలు, పురుషులు, థర్డ్ జెండర్ ఓటర్ల వివరాలు ఉన్నాయి. మండలాలు, గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వారీగానూ ఈ వివరాలను పొందుపరిచారు. స్టేషన్ ఘన్‌పూర్, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి, ములుగు, హుస్నాబాద్, హుజూరాబాద్, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. భద్రాచలం సెగ్మెంట్‌లో మహిళల ఓటర్ల సంఖ్య బాగా ఎక్కువగా ఉన్నది. ఈ సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 1,44,118 మంది ఉన్నారు. వీరిలో 74,794 మహిళా ఓటర్లు, 49,321 పురుష ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్ల పరంగా చూస్తే ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన తుది బాబితాతో పోల్చితే సగటున ప్రతి నియోజకవర్గంలో రెండు నుంచి ఐదు శాతం వరకు ఓటర్లు పెరిగారు. వీరిలో 18 ఏండ్లు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన వారు ఎక్కువగా ఉన్నారు.

**ఇక మొదలు..**

ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటరు తుది బాబితా తయారు కావడంతో ఇక అసలు ప్రక్రియపై ఆసక్తి నెల కొన్నది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమితులైన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ప్రతి రోజు ఇదే ప్రక్రియలో నిమగ్నమవుతున్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి రేషనలైజేషన్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. దివ్యాంగ ఓటర్లు, వృద్ధుల కోసం అవసరమైన వసతులను కల్పించేందుకు కింది స్థాయి వారితో సమన్వయం చేసుకుని పని చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తుందనే సమాచారంతో పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేస్తున్నారు.

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | పురుషులు | మహిళలు | ట్రాన్స్ జెండర్స్ |
|---|---|---|---|---|
| జనగామ | 222492 | 111269 | 111212 | 11 |
| స్టేషన్ ఘన్‌పూర్ | 236994 | 118168 | 118825 | 01 |
| పాలకుర్తి | 237750 | 119432 | 118311 | 07 |
| డోర్నకల్ | 214154 | 105886 | 108242 | 26 |
| మహబూబాబాద్ | 245765 | 121441 | 124289 | 35 |
| నర్సంపేట | 226617 | 111870 | 114742 | 05 |
| పరకాల | 217054 | 106451 | 110601 | 02 |
| వరంగల్ పశ్చిమ | 277125 | 137139 | 139976 | 10 |
| వరంగల్ తూర్పు | 246282 | 120323 | 125621 | 338 |
| వర్ధన్నపేట | 260555 | 128722 | 131818 | 15 |
| భూపాలపల్లి | 268028 | 133461 | 134562 | 05 |
| ములుగు | 220886 | 108588 | 112277 | 21 |
| హుస్నాబాద్ | 236575 | 117165 | 119406 | 04 |
| హుజూరాబాద్ | 244514 | 119676 | 124833 | 05 |
| మంథని | 230306 | 113828 | 116458 | 20 |
| ఇల్లందు | 211526 | 104272 | 107253 | 01 |
| భద్రాచలం | 144118 | 49321 | 74794 | 03 |

# చెట్లపొదల్లో పసికందు

- శిశువును వదిలించుకున్న పేగుబంధం
- కాపాడిన పోలీసులు.. స్థానిక ప్రభుత్వ దవాఖానలో చికిత్స
- ఎంజీఎంకు తరలింపు.. నిలకడగా ఆరోగ్యం


చెట్ల పొదల్లో ఉన్న పసికందు

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 4 : ఏ కారణం చేతనో గాని, ఇక్కడ కన్నపేగు బంధానికే మాయని మచ్చలా నిలిచే ఘటన జరిగింది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెట్లపొదల్లో వదిలేసిన అమానవీయ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం పాత్రపురం గ్రామంలో బుధవారం వెలుగుచూసింది. కనురెప్పలు తెరువకముందే పసికందును కడతేర్చాలని చూసిన దారుణం స్థానికులను కలిచివేసింది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు వచ్చి శిశువును స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు. అటునుంచి ఎంజీఎం వైద్యశాలకు తరలించగా పాప ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత్రపురం గ్రామ శివారులోని చెట్లపొదల్లో పసికందు ఏడుపును అటుగా వెళ్లిన వారు బుధవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకొని పసికందును స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు పంపించారు. పుట్టిన బిడ్డ ఆడపిల్ల అనే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. కాగా, శిశువును పొదల్లో పారేసిన ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

# గేదెకు రెండు దూడల జననం


నర్సింహులపేటలో దూడలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి సౌమ్య

నర్సింహులపేట, అక్టోబర్ 4 : గేదెలకు ఒక దూడ మాత్రమే జన్మిస్తుంది. కానీ మండల కేంద్రంలోని పొన్నం సంజీవకు చెందిన గేదెకు రెండు దూడలు బుధవారం జన్మించాయి. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ.. గేదెకు కృతిమ గర్భధారణ చేశామని, ఇలా రెండు దూడలు జన్మిస్తాయన్నారు. రెండు దూడలు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు.

## నీటి సంపులో పడి బాలుడి మృతి


తరుణ్ మృతదేహం

కేసముద్రం, అక్టోబర్ 4 : కేసముద్రం విలేజీలో నీటి సంపులో పడి బాలుడు మృతి చెందినట్లు ఎస్సై కోగిల తిరుపతి తెలిపారు. గ్రామానికి చెందిన గుండెబొయిన అశోక్–శారద దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. అశోక్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడి కుమారుడు తరుణ్ (3) ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. బాబు కనిపించక పోవడంతో తల్లి శారద వెతకగా, సంపులో తరుణ్ విగత జీవిగా కనిపించాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

డోర్నకల్, అక్టోబర్ 4 : బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు తెలిపారు. డోర్నకల్‌లో ఓ బాలికపై మంగళవారం రాత్రి వ్యక్తి లైంగిక దాడి చేసేందుకు యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# హత్య కేసులో ఐదుగురి రిమాండ్

- ఆటో, రెండు బైకులు సీజ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ డేవిడ్‌రాజ్


నిందితుల అరెస్టు చూపుతున్న కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ గోపి, ఎస్సైలు అశోక్‌కుమార్, సురేశ్,

హసన్‌పర్తి, అక్టోబర్ 4 : హత్య చేసిన ఐదుగురి నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ వివరాలు వెల్లడించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన తుమ్మల రాజు అనంతసాగర్‌కు చెందిన బైరగాని కుమారస్వామి కూతురిని వేధిస్తున్నాడు. దీంతో బైకాని కుమారస్వామి, అతడి కుమారుడు శివకుమార్, బావమరిది ఎల్లబోయిన అనిల్, అల్లుడు సంజీవ్‌తో కలిసి తుమ్మల రాజును చంపాలని పథకం పన్నారు. గత నెల 30వ తేదీన తుమ్మల రాజు అనంతసాగర్‌లో తిరుగుతుండగా కుమారస్వామి భార్య కేతమ్మ చూసి మిగతా వారిని పిలిచి రాజుపై దాడి చేసి ఇంట్లోకి ఈడ్చుకెళ్లి హతమార్చారు. తర్వాత ఆటో సహా మృతదేహాన్ని జయగిరి శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో పడేశారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. రాజు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు రోజుల తర్వాత వర్ధన్నపేట కట్ర్యాలలోని కెనాల్‌లో మృతదేహాన్ని గుర్తించారు. నిందితులు ఉపయోగించిన ఆటో, రెండు బైకులను స్వాధీనం చేసుకుని బైకాని కుమారస్వామి(45), బైకాని శివకుమార్(19), ఎల్లబోయిన అనిల్(31), బైకాని కేతమ్మ (38), మామిడ్ల సంజీవ్(29)పై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన సీఐ తుమ్మ గోపి, ఎస్సైలు అశోక్‌కుమార్, సురేశ్, వలీ, పోలీస్ సిబ్బంది క్రాంతిని అభినందించారు.

# కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్


రామప్ప ఆలయంలో పేరిణీ నృత్యం చేస్తున్న కళాకారులు

వెంకటాపూర్, అక్టోబర్ 4 : పాలంపేట గ్రామంలోని హరిత హోటల్‌లో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్ కొనసాగుతున్నది. బుధవారం రామప్ప చెరువు కట్టపై పాత గెస్ట్ హౌజ్ ఆవరణలో రెండు గంటల పాటు యోగ శిక్షణ ఇచ్చారు. పురాతన కట్టడాలపై ఫొటోగ్రఫీ డాక్యుమెంటేషన్‌పై వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఎం శశి, కాకతీయ మాన్యుమెంట్స్‌పై కల్పన రమేశ్ వివరించారు. అనంతరం రామప్ప దేవాలయంలో పేరిణి శివతాండవాన్ని ఐ పైడారావు, ఎం లోహిత్, పీ సంతోష్, పేరిణి లాస్యాన్ని పీ శ్రీజ, బీ తేజస్వీని, బీ వైష్ణవి, జీ విద్యశ్రీ, ఏ సుగందిని ప్రదర్శించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, సేవా టూరిజం అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్, జగదీశ్, కాకతీయ యూనివర్సిటీ స్కాలర్ కొక్కుల ప్రశాంత్, ట్రస్టు సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.